# ఆడపిల్ల

"భగవంతుడా! యీ ఆడపిల్లల పెళ్ళి బాధ పగవాళ్ళకి కూడా వద్దు!" చేతిలోని ఉత్తరం బల్లమీద పడేసి, కనిపించని దేముడికి మొర పెట్టుకున్నాడు విశ్వనాధం.

ఏమిటి? వీళ్ళూ నచ్చలేదని రాసేసారా ఏమిటండీ?" ఆత్రుతగా భర్త మొహంలోకి చూస్తూ అడిగింది కమలమ్మ.

"ఆహా!. మహారాజులా వ్రాశారు! వాళ్ళకేం! మగపిల్లలవాళ్లు! నచ్చలేదని వ్రాసి పారేస్తారు. మనపాట్లు వాళ్ళ కెందుకు తెలుస్తాయి!"

"ఖర్మ!....యింక యీ జన్మకి దానికి పెళ్ళయే గీత లేదులావుంది!"

"యింక దానికి పెళ్ళి చేయడం నా వల్ల గాదు! నేనింక తిరగ లేనే!" నిట్టూరుస్తూ బాధగా తల పట్టుకున్నాడు విశ్వనాధం.

"ఏమిటో, దాని రాత యిలావుంది. దాని యీడు వాళ్ళందరూ పెళ్ళి ళ్ళయి సంసారాలు చేసుకుంటున్నారు. యిదిలా యింకా మనగుండెల మీద కుంపటిలా కూర్చుంది. యీ పెళ్ళికొడుకుల కోరికలకి అనుగుణంగా కాస్త తెల్లతోక్క అయినా బాగుండేది. వాళ్ళ కోరికలెలా ఆకాశాన్నంటుతున్నాయో దీ నందమూ అలాగే వుంది!"

బాగుంది. మనకు లేని అందం మనపిల్లకి ఎక్కడనించి వస్తుంది? వాడెలా వుండనీ, చేసేది గుమస్తా పని, కాని వాడి కోబోయే భార్య మాత్రం సినిమా తారలా వుండాలి, చదువుండాలి, స్టేటస్ వుండాలి. మామగారికి దండిగా కట్నమివ్వగల తాహతు వుండాలి! యీ హిరణ్యాక్ష వరాలన్నీ తీరాలంటే ఆడపిల్లలకి యీ జన్మలో పెళ్ళిళ్ళవడం అనేది అసంభవం!"

"యిదంతా మన ఖర్మ ! ...దానికి పెళ్ళి కాలేదన్న బాధ అటుంచి, లోకుల బాధ భరించలేకుండా వున్నాను. మనపిల్ల పెళ్ళిబాధ మనకంటె ఊర్లో వాళ్ళకెక్కువగా ఉన్నట్లుంది. ప్రతి రోజూ క్రొత్తగా అడగడమే" "అమ్మాయికి పెళ్ళి కుదిరిందా, "పెళ్ళెప్పుడూ?" అంటూ, అక్కడికి పెళ్ళి అనేది ఓ గంటలోనో, రోజులోనో కుదిరిపోయేటట్లు కుదిరినా, మన మేదో కావాలని చేయకుండా ఊరుకున్నట్టు ! వాళ్ళ యింట్లో ఆడపిల్లలున్నా సరే, అక్కడికి ఆ బాధలేవీ తమకు లేనట్లు, మనమే చేయక పాపం గట్టు కున్నట్టు పరామర్శించ బోతారు ! వెధవగోల వచ్చిపడింది. దీని మూలంగా యీ బాధలన్నీ తల్చుకుంటే, పుట్టగానే పీక నులిమి అవతల పారేశాను గాదేమో అనిపిస్తూంది !" కూతురు పెళ్ళి కాలేదన్న బాధతో ఉక్రోషంగా అంది కమలమ్మ.

"హుష్, ఊరుకో ! అదివింటే బాధ పడ్తుంది !" మందలించాడు విశ్వనాథం.

ప్రక్క గదిలోంచి అంతా వింటూనే వుంది సీత. సీత అందగత్తె కాదు ? అలాగని కురూపీ కాదు. ! ఏ వికారం లేదు. ఎటొచ్చీ కాస్త పొట్టిగా, నల్లగా వుంటుంది. పుట్టిన అందరూ తెల్లగా ఉండరు ! నల్లటి వాళ్ళకి పెళ్ళిళ్ళు కాకుండాను లేదు. అయితే సీత కెందుకు పెళ్ళిగాదు ? ఘటన లేదనో, అదృష్టం లేదనో సరి పెట్టుకోవాలి. యించు మించు పదేళ్ళ నించి సాగుతున్న పెళ్ళి ప్రయత్నాలు ఇప్పటికీ ఏ కొలిక్కీ రాకపోవడానికి కారణం సీత దురదృష్టం అని చెప్పుకోవాలి. సీతకంటే ముందు ముగ్గురు ఆడపిల్లలకి అంత ప్రయాస లేకుండానే పెళ్ళిళ్ళు అయ్యాయి. పెద్ద చదువు లేకపోయినా, అందగత్తెలు కాక పోయినా పెద్ద కట్నాలు పోయకుండానే ఏదో వాళ్ళ బ్రతుకులు వాళ్ళు బ్రతికేపాటి సంబంధాలు చేశాడు. ఎటొచ్చీ సీత వేళకి పరిస్థితులు చాలా మారాయి.

కాలానుగుణంగా సీతని మెట్రిక్ వరకు చదివించాడు విశ్వనాథం. అంతకంటె ఎక్కువ చదివిస్తే అంతకు మించిన మొగుడ్ని తెచ్చే తాహతు

లేక సీతని మెట్రిక్‌తో మానిపించి అప్పట్నుంచి పెళ్ళి సంబంధాలు వెతకడం ఆరంభించారు.

మెట్రిక్ చదిసిన పిల్లకి ఏ బి. యే. మొగుడన్నా కావాలి. అతడికి యీమె నచ్చాలి! తన తాహతుకి మించిన కట్నం యీయడానికి సిద్ధపడ్డా ఫలితం శూన్యం! కొందరు ఫోటో చూసే తిరిగిపోయారు! పిల్లను చూసి నచ్చలేదన్నారు కొందరు, కొందరికి మిగతా విషయాలు కుదరలేదు. గత పదేళ్ళనించి చూచిన పది, పదిహేను సంబంధాలు యిలాగే అయిపోయాయి. రోజులు గడిచిన కొద్దీ సమస్య పెద్దది కాసాగింది. ముఖ్యంగా సీతకి. సంతలో పశువులాగ తనకీ పెళ్ళిచూపుల శల్యపరీక్షలు ఎప్పటికి అంతం అవుతాయో, అసలు అంతంటూ వుంటుందో, ఉండదో తేలని సమస్య అయింది. ఒక్కొక్క సంబంధం వచ్చి తిరిగి పోతుంటే సీతకు పెళ్ళిపట్ల విముఖత రోజురోజుకీ పెరగసాగింది. అయినా పైకి చెప్పలేక, తల్లి తండ్రులకీ కష్టం కల్గించలేక తనలోని బాధని తనలోనే అణుచుకునేది.

తల్లి తండ్రుల మాటలతో, సీత తనకింక పెళ్ళికావడం కల్ల అని నిశ్చయించుకుంది. యింక అనవసర ప్రయాసతో, అనవసరపు ఆశలతో తండ్రి బాధ పడకూడదు! ఆ మాట తండ్రితో గట్టిగా చెప్పాలి తను.

టేబిల్ మీద తలవాల్చి మనసులోని ఆవేదనని కన్నీళ్ళ ద్వారా వెలిబుచ్చుతూన్న సీత కళ్ళు వత్తుకుంటూ లేచి నిలుచుంది.

"ఏడుస్తున్నావా అమ్మా!" కూతురి మొగంలోకి చూడగానే విశ్వనాథం గొంతు పూడింది!

"నువ్వెందుకే తల్లీ ఏడవడం! నిన్ను కన్నందుకు, నీకు పెళ్ళిచేయలేక నలుగురిలో తలెత్తుకు తిరగలేక మే మేడవాలి గాని!" కటువుగా అంది కమలమ్మ. ఎవరిమీద చూపలేని కోపం, పగ, కసి, బాధ తీర్చుకోడానికి ఆమె కింక ఎవరూ కనపడలేదు.

"అవును. నువ్వన్నట్టు పుట్టగానే గొంతు పిసికి పారేసివుంటే అప్పటి ఏడుపుతో సరిపోయేది మీకు. యిప్పుడిలా నా గురించి ఏడవాల్సిన అవసరం లేకపోయేది।" ఉక్రోషంగా అంది సీత.

"అమ్మ ఏదో బాధలో అందమ్మా! నీవుకూడా అలా మాట్లాడ తావేమిటి?"

"నాన్నా. నేనొకటి చెపుతాను వింటావా?"

"ఏమిటి?"

"యికనించి మీరు నా పెళ్ళిమాట ఎత్తడానికి వీలులేదు. యీ రోజు నించి నా కోసం సంబంధాల వేట మానేయండి."

"మానేసి" శుష్కహాసం చేశాడు విశ్వనాధం.

"నే నసలు పెళ్ళి చేసుకోను, మీ రనవసరంగా బెంగ పెట్టుకోకండి" దృఢంగా అంది సీత.

"బాగుంది సంబరం! పెళ్ళి వద్దుట! పెళ్ళిచేసుకోకుండా కూర్చో, యింక తలెత్తుకోనక్కర లేదు నలుగుర్లోనూ! యిప్పటికే సగం చచ్చాను అర్థమైనవాళ్ళ దెప్పులతోటి.

"నాన్నా! నే నేదన్నా ఉద్యోగం చూసుకుంటాను. సెకండరీ గ్రేడు ట్రైనింగ్‌కి పంపించండి, ఏ స్కూలులో నన్నా ఉద్యోగం దొరకకపోదు. నా పొట్ట నేను పోసుకుంటాను।"

సీత తన నిర్ణయం చెప్పాక విశ్వనాధం కొంతసేపు ఆలోచించాడు. చివరికి విశ్వనాధంకీ కూతురు చెప్పింది సబబుగానే తోచింది. పెళ్ళి కాని సీత సంగతి తను కాస్త హరీ అనగానే ఏమవుతుంది? ఆమె కాళ్ళమీద ఆమె నిలబడలేని పరిస్థితిలో ఆమె బ్రతుకు నానా అగచాట్ల పాలవుతుంది. కొడుకు కొంతకాలం మంచిగా వున్నా, తరువాత ఎలా మారుతాడో! వాడి సంపాదన వాడకే చాలదు. యింక చెల్లెలిని ఎన్నాళ్ళు భరిస్తాడు! అన్నగారి

యింట్లో చాకిరి చేస్తూ, వాళ్ళు విసుక్కుంటూ పడేసే మెతుకులతో యెన్నాళ్ళని కాలక్షేపంచేస్తుంది ?

భవిష్యత్తుని ఊహించిన విశ్వనాథం సీత నిర్ణయమే చాల మంచిదన్న అభిప్రాయానికి వచ్చాడు.

ఓ డిగ్రీ తెచ్చుకుంటుంది. ఏదో ఉద్యోగం చూసుకుని ఒకరి మీద ఆశపడకుండా బ్రతక గలుగుతుంది. అదృష్టంవుంటే అప్పుడే ఆమెకి నచ్చిన వాణ్ణెవణ్ణైనా కట్టుకుంటుంది. కనీసం ఒకరి దయా ధర్మాలమీద ఆధారపడకుండాఉంటుంది. పెళ్ళి చేయలేక పోయినందుకు ఆమెకామాత్రం ఉపాధి కల్పించడం తన కనీస ధర్మం.

"ఏమంటారు నాన్నా !" జవాబుకోసం ఆశగా చూసింది సీత ఆలో చిస్తున్న తండ్రి మొహంలోకి.

"నీవు చెప్పిందే బాగుందమ్మా ! సెకండ్రీ గ్రేడు ట్రైనింగేం ఖర్మ ! నిక్షేపంలా పైకి చదువుకో. ఏ డిగ్రీ అన్నా సంపాదించాక, ఏదో మంచి ఉద్యోగం దొరక్కపోదు. పెళ్ళి చేయ్యలేని అసమర్థుణ్ణయినందుకు యీ మాత్రమైనా చేసి నీకో దారి చూపెట్టడం నా బాధ్యత !"

"బాగుంది వరస ! దానికి మతిపోతే, మీరు దానికి సై అంటారేమిటి? ఆడ పిల్లకి పెళ్ళి చేయడం మాని, చదివించి ఉద్యోగం చేయిస్తారట" కోపంతో కసిరింది కమలమ్మ.

"అవునే, ఏం చెయ్యమంటావు ! దాని కేదో దారి చూపించక పోతే మన తర్వాత దాని గతేం కాను ?"

"దారి !....గోదారి !.... అంతకన్నా కట్ట కట్టుకుని ఆ గోదార్లో దూకితే ఏ బాధ వుండదు !" రుసరుస లాడుతూ వెళ్ళిపోయింది కమ్మలమ్మ.

"మీ అమ్మకి నీ పెళ్ళి కాలేదన్న చింతలో మతి పూర్తిగా పోయింది. నువ్వు ఆవిడ మాటలు పట్టించుకో కమ్మా ! రేపే కాలేజీకి అప్లికేషన్ రాయి !" కూతురికి ధైర్యం ప్రోత్సాహం ఇచ్చాడు విశ్వనాథం.

చూస్తుండగానే అయిదేళ్ళు అయిదు నిమిషాల్లాగ గడిచినట్లనిపించింది సీతకి. చదువుమీదే దృష్టి వుంచుకుని. బి. ఏ. బి. యిడి. అయింది. ఆ తర్వాత కష్టం లేకుండానే ఓ ఊళ్లో గరల్స్ స్కూల్లో టీచరు ఉద్యోగం సంపాదించుకుంది.

యీ అయిదేళ్ళలో యింట్లో పరిస్థితులు చాల మారాయి. కూతురి పెళ్ళి బెంగతోనే మంచం పట్టి తీసుకుని తీసుకుని సీత బి. ఏ. చదువుతూండగానే కన్నుమూసింది కమలమ్మ. యిటు భార్య మరణం, కూతురు భావి జీవితాన్ని గురించిన చింత, హఠాత్తుగా సంక్రమించిన పక్ష వాతంతో మంచంలో తీసుకుంటూ, కొడుకింట్లో, కొడుకు చేతుల మీదుగా దాటిపోవడానికి యెదురుచూస్తూ కాలం గడుపుతున్నాడు విశ్వనాథం.

మొదటి సారిగా ఉద్యోగంలో చేరడానికి అన్నను వెంటబెట్టుకుని ఉద్యోగం ఊరు చేరుకుంది సీత. అన్నగారు ముందుగానే ఓ స్నేహితుడి ద్వారా ఓ యిల్లు కుదిర్చి పెట్టాడు?

విశ్వనాథం సీతని ఆడపిల్లని అత్తవారింటికి సాగనంపినట్లుగా ఎన్నో జాగ్రత్తలు భోధపరిచాడు. సీత పెళ్ళిఖర్చుకు దాచిన డబ్బు చదువుకు అవగా మిగిలిన రెండొందలు చేతిలో పెడ్తూ 'అమ్మా' యిదే నీ సారెడబ్బు అనుకో, దీన్తో యింట్లోకి కావల్సిన వస్తువులు ఏమన్నా కొనుక్కో మని సాగనంపుతూంటే ఆయన కళ్ళలో నీరు తిరిగింది. సీతకి కూడా పుట్టిన వూరుని తండ్రిని వదిలి వెళ్ళడానికి ఏంతో కష్టం అనిపించినా క్రొత్తగా చెయ్యబోయే ఉద్యోగపుటుత్సాహంతో ఆ భాధ త్వరగానే మరచిపోయింది.

సీతకి యిల్లు బాగానే అమిరిందనిపించింది చిన్నదైనా. ముందు ఒక పెద్దగది. దాని గుమ్మం వీధివైపు వుండడం మూలాన బయటికి వేళ్లేటప్పుడు తాళం వేసుకు వెళ్లచ్చు. వెనకాతల ఓ చిన్న గది సామాన్లు పెట్టుకోడానికి. దాని వెనక చిన్న వంటగది. కుళాయి, బాత్‌రూము అన్నీ సమపాయంగా

ఉన్నందుకు, చవగ్గా నలభై రూపాయల్లో అన్నీ అమిరినందుకు యెంతో ఆనందించింది.

ముందు గదిలో తండ్రి యిచ్చిన డబ్బుతో కొన్న టేబిల్, కుర్చీ, మంచం వేసుకుంది. వెనగ్గదిలో పెట్టెలు, బట్టలు సర్దింది. వంటగదిలో క్రొత్తగా కొన్న స్టవ్, గిన్నెలు యింటినుంచి తెచ్చుకున్న ఊరగాయలు అన్నీ అమర్చుకుంది. ఆ చిన్న క్రొత్త సంసారాన్ని చూసి మురిసిపోయింది. ఆమె కలలన్నీ పండి యెన్నేళ్ళనించో యెదురు చూసిన స్వర్గం కళ్ళముందు కనిపించి నట్లయింది. సంసారానికి కావల్సినవన్నీ ఒక్కొక్కటే ప్రతి నెలా కొనుక్కోవా లనుకుంది. యిన్నాళ్ళకి తనదీ అంటూ ఏర్పడిన సంసారం ఆమెని ఎంతో మురిపించింది.

చెల్లెలి దగ్గర రెండు రోజులుండి అన్నీ అమర్చి, అన్ని అప్పగింతలు పెట్టి, సెలవులకి వస్తూండమని, వారం వారం ఉత్తరాలు రాయమని హెచ్చరించి అన్నగారు వెళ్ళిపోయాడు.

మొదటినెల జీతం అందుకోగానే తనేదో పెద్ద ఘనకార్యం సాధించినట్లు తృప్తిపడింది సీత. ఓ అరవై రూపాయలు తండ్రికి, అన్నకి, వదినకి బట్టల కంటూ యింటికి పంపుతూ ప్రతినెల ఓ ఏభై రూపాయలు తండ్రికి మందుల కోసం పంపుతానంటూ రాసింది. దానికి విశ్వనాథం బాధపడ్తూ 'అమ్మా ఆడపిల్ల సొమ్ము తినమంటావా? నీకు పెట్టవలసింది పోయి, నీదగ్గిర తీసుకోనా' అంటూ వ్రాసినా సీత సొమ్ము పంపడం మానలేదు. యింటి దగ్గిర ఉన్న ఒక్కడి సంపాదన రెండువందల జీతంతో వదిన, యిద్దరు పిల్లలు రోగిష్టి తండ్రి అందరికీ గడవడం కష్టం.

ఆ పరిస్థితి ఆమెకీ తెలుసు. తను పంపక పోతే జరక్కపోదు గాని, పంపితే సహాయంగా వుంటుంది. పైగా తను తండ్రిని పెద్ద తనంలో ఆదుకో గలుగుతూాందంటే అదొక తృప్తి, సంతోషం.

ఉదయం లేచి స్నానం వగైరా కానిచ్చి కాఫీ పెట్టుకుని త్రాగి ఆ స్టవ్ మీదే వంట కానిచ్చి కాసేపు ఏ పుస్తకమో చదివి, భోంచేసి

స్కూలుకి వెడుతుంది. మధ్యాహ్నం కాఫీ ఫ్లాస్కులో పోసుకు పట్టుకు పోతే యింక సాయంత్రం దాక యింటికి రావడం బెంగవుండదు. సాయంత్రం ఇంటికి వస్తూనే కాసేపు రెస్టు తీసుకుని మొహం కడిగి, వంటచేసు కుని వెంటనే తినేస్తుంది. ఆ తర్వాత మర్నాడు చెప్పవలసిన పాఠాలు ఓ గంట చూసుకోడం, పడక .. యిదీ సీత దినచర్య.

అన్ని విధాల అన్నీ సుఖంగా అమరినందుకు యెంతో సంతో షించింది. స్కూల్లో హెడ్ మిస్ట్రెస్ చాల మంచిది. మొదటి రోజే ఎంతో అభిమానం కనపరిచింది. వచ్చిన పదహేను రోజులకే తోటి ఉపాధ్యాయి నులతో స్నేహం కుదిరింది. పిల్లలలో కూడా సీత పాఠాలు బాగా చెప్తుందన్న పేరు వచ్చింది.

ఇంటావిడని 'పిన్నిగారూ' అంటూ పిలిచి మంచి చేసుకుంది సీత. సీతకి పనిమనిషిని, పాలు వగైరాలకి మనుష్యులని కుదిర్చి పెట్టింది యింటామె. కూర నార వీధిలోనికి వచ్చినవి తను కొనేటప్పుడు సీతకి ఏరి పెట్టడం పండగలకి భోజనాలకి పిలవడం వగైరాల్తో సీతతో కలుపుగోలు తనం చూపింది.

యింటావిడ ఏభై ఏళ్ళ మనిషి. భర్తపోయి అయిదు సంవత్సరా లైంది. ఉన్న యిద్దరు కూతుళ్ళు కాపరాలు చేసుకుంటున్నారు. భర్త వది లిన ఆస్తి, స్వంత యింట్లో గుట్టుగా కాలక్షేపం చేస్తూంది ఆమె. మగ సాయానికి తమ్ముడు శంకరాన్ని యింట్లో తెచ్చి పెట్టుకుంది.

శంకరానికి చదువు సంధ్యలు అబ్బలేదు. మెట్రిక్ మూడుసార్లు తప్పి యింక ఆ ఉద్యమం విరమించుకున్నాడు. అక్కగారి యింట్లో తిష్ఠ వేసి ఆమె డబ్బుతో దర్జాలు వెలిగించడం ఒక్కటే ఉద్యోగం. పొలం పనులు, కాస్త డబ్బు వ్యవహారాలు చూసి మగ దక్షతగా వుంటాడని యింట్లో వుంచుకున్న ఆమె రాను రాను తమ్ముడి అధికారానికి పూర్తిగా లొంబడి, అతనిచేతి కీలుబొమ్మ అయింది.

శంకరం అంటే మొదటిరోజే సీతకి ఎందుకో సదభిప్రాయం కలగలేదు. గిరజాల హైరోడ్ క్రాపు, ఫ్రెంచి కట్ మీసం, యిరవై నాల్గు గంటలు నోట్లో సిగరెట్టు, చదువు ఉద్యోగం లేకపోయినా రోజు కో మాదిరి వేషం, వచ్చే పోయే ఆడవారి వంక అతని చూపులు అవి సీతకి నచ్చలేదు. ఏదో కృత్రిమంగా తోచేది. తన కెందుకు ఆ గొడవ అనుకునేది.

మొదట కొన్ని నెలలు రోజులు నిశ్చింతగా దొర్లిపోసాగాయి సీతకి. తన పాఠాలు, తన యిల్లు తన వంట వాటితో కాలం గడిచి పోయేది. పదిహేను రోజుల కోసారి స్నేహితులతో సినిమాకి వెళ్ళడం తప్ప యింకెక్కడికీ యిల్లు వదిలేది కాదు. సీత ఎం. ఏ. కి ప్రైవేటుగా కట్టాలని పుస్తకాలు తెప్పించి చదువు ఆరంభించింది.

సీత వంటరిగా వుండటం, శంకరం మెదడ్లో క్రొత్త క్రొత్త ఆలోచనలు పుట్టించింది. ఆమె యింట్లో వున్నంతసేపు వీధి వరండాలో యెదుటగా కుర్చీ వేసుకుని ఆమె గదివైపే దొంగచూపులు చూస్తూ కూర్చోడం ఆరంభించాడు. చూసినా పట్టించుకోకుండా సీత తన పని తను చేసుకుపోయేది. కొన్నాళ్ళకి శంకరం యింకా చొరవచేసి పెరట్లో తచ్చాడడం ఆరంభించాడు. సరిగ్గా సీత స్నానం చేసే సమయానికి బాత్ రూము ముందు నోట్లో బ్రష్ పెట్టుకుని పచార్లు చేసేవాడు. చీర చుట్ట పెట్టుకుని బయటికి వచ్చే సీత శంకరాన్ని చూసి సిగ్గుతో చితికిపోతూ లోపలికి పరుగెత్తేది. ఒకరోజు నయితే యధాలాపం అనుకోవచ్చు, కాని శంకరం రోజూ అదే సమయానికి, సీత ఏవేళకి స్నానం చేసినా అక్కడ ప్రత్యక్ష మయేవాడు. స్నానం చేసి బిందెతో నీళ్ళు పట్టుకోడానికి పెరట్లో కొళాయి దగ్గరకి వెళ్ళేసరికి కొళాయి దగ్గర పల్చటి తువ్వాలు చుట్టుకుని స్నానం చేస్తూ వెకిలి నవ్వులు నవ్వేవాడు శంకరం. సీత రెండు నిమిషాలు నిలబడి చూసి వెనుదిరిగే సమయాని- "నీళ్ళు కావాలా. పట్టుకోండి.... చెప్తే ముందే లేచేవాణ్ణిగా!" అంటూ పెద్ద ఉపకారం చేసిన వాడిలాగ పోజుపెట్టేవాడు. రోజు రోజుకీ సీతకి స్నానం చెయ్యడమన్నా, దొడ్లో నీళ్ళు పట్టుకోడం అన్నా గండం అవసాగింది.

ఒకరోజు యింకా స్త చొరవచేసి ముందు గదిలోకే వచ్చాడు శంకరం చేతిలో ఏవో పత్రికలు పట్టుకుని.

"ఏమండీ, మీకెలా కాలక్షేపం అవుతుంది ? ఎంతసేపని ఆ స్కూలు పుస్తకాలు చదువుతారు! మీకోసం పత్రికలు తెచ్చాను... యిమ్మంటారా ?" మర్యాద తెచ్చి పెట్టుకుని అడిగాడు.

ఆ పరిస్థితి ఎలా ఎదుర్కోవాలో సీతకి తెలియదు. "యిదివరకు ఏవో చదివే దాన్నిగాని, యిప్పుడు యీ చదువు, ఉద్యోగంతో నాకు తీరడం లేదండీ।" అంది.

"యీ మధ్య మంచి సీరియల్స్ వస్తున్నాయి. చదివి చూడండి"

"అలాగా! అయితే అక్కడ వుంచి వెళ్ళండి, వీలున్నప్పుడు చదువుతాను।"

ఏదోవిధంగా తొందరగా శంకరాన్ని వదిలించుకోడానికి పుస్తకాలు తీసుకుంది సీత.

అప్పటినించి రెండు రోజుల కోసారి ఏవో పుస్తకాలు పట్టుకుని రావడం ఆరంభించాడు శంకరం. వచ్చినవాడు తొందరగా వదలక, తనే కుర్చీ జరుపుకుని కథలు, నవలలు, రచనలు, సినీమాలు, చర్చలు, విమర్శలు సాగించాడు. లోపల్నించి మండుకొచ్చినా ఏ మనలేక వూరుకునేది సీత. ఆమె అశక్తతని పూర్తిగా వినియోగించుకునే వాడు శంకరం. మొదట్లో పుస్తకాలు, సినీమాలు, లోకాభిరామాయణంతో ఆరంభించి, క్రమంగా స్వవిషయాలు గురించి మాట్లాడడం, అడగడం మొదలు పెట్టాడు.

"మీరింకా పెళ్ళి చేసుకోలేదేం సీతగారూ।" అన్నాడొకసారి. సీత జవాబీయలేదు "ఏం అసలు చేసుకోరా ఏమిటి ?" మళ్ళీ అడిగాడు.

సీత సమాధానం చెప్పవలసిన అవసరం లేనట్లు. ఉదాసీనత వ్యక్తం చెయ్యడం తప్పించి ఏం చెయ్యలేక పోయింది. ఆ తర్వాత శంకరం

క్రమేపి ఎలాగో అలాగ సంభాషణ ప్రేమ, ఉన్నత చదువు చదివిన అమ్మాయిలు తమ కన్నా తక్కువ చదివిన అబ్బాయిలని వివాహమాడ్డానికి అంగీకరించవలసివచ్చిన అవసరం, స్త్రీకి ఉద్యోగం కన్నా, గృహమే ముఖ్యమన్న సత్యం, యిలాంటి విషయాల మీదికి మళ్ళించేవాడు. ఆమె జవాబులు కోరేవాడు. తన అభిప్రాయాలు అడక్కుండానే వ్యక్తం చేసేవాడు.

“చూడండి, శంకరంగారు ఏమనుకోకండి గాని, మీరిలా అస్తమానూ రావడం అంత బాగుండదు! ఎవరైనా చూస్తే నానారకాలుగా అంటారు. పుస్తకాలు కావలిస్తే నేను కొనుక్కుంటానులెండి....” అంటూ నిక్కచ్చిగా ఓరోజు చెప్పింది సీత. శంకరం తెల్లబోయాడు.

“యిందులో బాగులేక పోవడానికి ఏముంది! ఎవరేమనుకుంటారు!” ఎదురు ప్రశ్న వేశాడు,

సీత తలపట్టుకుంది. భగవంతుడా వీడి కెలాచెప్పడం! పోనీ ఓ నాలుగైదు రూపాయలు ఖర్చయితే అయింది. ఆ పుస్తకాలేవో తనుకొంటే వదుల్తాడేమో అనుకుంది. అది చూసిన శంకరం ‘ఓ, మీరూ యీ పుస్తకాలు కొన్నారా! అయితే నేను యివి కాకుండ వేరే కొంటాను, మీవి నేను, నావి మీరు చదవచ్చు’ అన్నాడు.

సీతకి క్రమేపి మనోవ్యధ లాంటిది పట్టుకుంది. శంకరాన్నుంచి ఎలా తప్పించుకోవాలో తెలియక బాధ పడేది!

ఉన్నట్లుండి యింకో వింత పరిణామం సీత మనశ్శాంతిని హరించింది, ఓ సెలవు రోజు మధ్యాహ్నం యింటావిడ యెంతో ఆప్యాయత వొలకపోస్తూ లోపలికి వచ్చింది. మర్యాదగా కుర్చీ యిచ్చి పలకరించింది సీత.

“అయితే సీతమ్మా. నాకు తెలియక అడుగుతా! యింకెప్పుడు పెళ్ళి చేసుకుంటావు. ఆడపిల్లవు. యిలా వంటరిగా వుండడం మంచిది కాదమ్మా! శంకరం కూడా నిన్న అదే మాటన్నాడు. వాడికి నువ్వంటే యెంత అభి

మానం అనుకున్నావు! నీకు పుస్తకాలు అవి తెచ్చిస్తున్నాడు కదూ! అసలు సాధారణంగా ఏ ఆడపిల్లని చూసినా ఎదో వంకలు పెడ్తాడు. చదువుకుని ఉద్యోగాలుచేసే ఆడపిల్లంటే అసలే పడదు. అలాంటిది, నువ్వు చదువుకున్న అహాయకు రాలివని, ఎలాంటి మిడిసిపాటు పడవని ఎంత పొగుడ్తాడో అస్తమానం! అసలు నువ్వీ యింట్లో అడుగుపెట్టిన దగ్గరనించి పూర్తిగా మారిపోయాడు."

ఈ ఉపోద్ఘాతం అంతా యెక్కడికి దారితీయబోతూందో గ్రహించిన సీత వళ్ళు భయంతో జలదరించింది.

"నీకేం తక్కువయింది? కాస్త ఓ చాయ తక్కువే అనుకో. కాని నీ మొహంలో మంచి కళవుంది సీతా! చదువుకున్నావు, ఉద్యోగం చేస్తున్నావు నీకేం లోటు! శంకరానికి పెద్ద చదువు లేకపోయినా తెలివి, తేటలున్నవాడు. నా సంసారం యీ మాత్రంగా గడిచి పోతూందంటే అంతా వాడి చలవే. ఉద్యోగం అవసరంలేదు వాడికి. ఏభై ఏళ్ళు కూర్చుని దర్జాగా తిన్నా తరగని ఆస్తి ఇచ్చిపోయారు నాన్నగారు. ఉన్నప్పుడు. ఏదో కాస్త అల్లరి చిల్లరగా వుండేవాడు గాని, యిప్పుడు వాడిమాట, నడక చూస్తే యెంత పెద్దమనిషయ్యాడోనని నాకే ఆశ్చర్యం వేస్తుంది. నువ్వూ చూస్తున్నావుగా?"

"ఆ! చూడకేం" మనసులోనే కసిగా అనుకుంది సీత.

"ఏదో వాడికి బుద్ధితెలియని వయస్సులో మా నాయనమ్మ మనవడి పెళ్ళిచూసి కళ్ళు మూయాలని, ఓ బొడ్డూడని పిల్లని తెచ్చి వాడికంట గట్టింది. పెళ్ళంటే అయింది కాని వాడేం సుఖపడి ఏడ్చాడు? ఒక్క ఏడాదన్నా సుఖంగా కాపురం చెయ్యలేదు. దానికేదో మాయదారి రోగంవచ్చి పోయింది. ఆరోజునించి ఎన్ని సంబంధాలు వచ్చినా నచ్చలేదని తిరగ్గొట్టేసాడు.

"శంకరం గారికి పెళ్ళి అయిందా?" ఆశ్చర్యంగా అడిగింది సీత.

"ఆ పేడుకి ఎప్పుడో అయిందిలే, అప్పటినించి పోరుతున్నా యిష్ట

పడని వాడు యిప్పుడు వాడంతట వాడే నిన్ను చూడగానే యిష్టపడు తున్నాడు. చక్కగా యిద్దరికీ యీడు జోడు కుదిరింది. అదృష్టవంతు రాలివి సీతా! కాస్త ఆలస్యమైనా మంచి సంబంధమే కుదిరిందిలే నీకు. యీ కబురు మీ వాళ్ళకి రాస్తే యెంత సంతోషిస్తారో! మీ నాన్నగారి అడ్రసు యీయమ్మా! యీ శుభవార్త పెద్ద దాన్ని నే నే వాళ్ళకి చేరేస్తా. యింక నెల రోజులలో మంచి ముహూర్తం వుందిట. శుభస్య శీఘ్రం అని కాని చేద్దాం. అంతేలే! యెప్పుడు యక్కడ యెవరికి రాసి పెట్టుందో యెవరు చెప్పగలరు? అసలు నిన్ను చూసినపుడే అనుకున్నాను. నీవు నా మరదలి వైతే బాగుండునని! ఏ దమ్మా మీ వాళ్ళ అడ్రసు ఓ కాగితం ముక్క మీద వ్రాసి యియ్యి!" అంతా నిశ్చయమైనట్లు, అసలు శంకరం ఆమెని పెళ్ళి చేసుకుంటా ననడమే మహా భాగ్యమన్నట్లు మాట్లాడ సాగింది.

సీత వళ్ళు వుడికిపోయింది. ఆమె అంటే వున్న సదభిప్రాయం దిగజారిపోయింది.

"నాకు పెళ్ళిచేసుకోవాలన్న ఉద్దేశం లేదండీ, అందుకే చదువుకుని ఉద్యోగం చేసుకుంటున్నాను." అతి ప్రయత్నం మీద ఆమాటలు చెప్ప గలిగింది సీత.

"అదేమిటమ్మా! పెళ్ళి పెటాకులు లేకుండా ఆడపిల్లవి యెన్నాళ్ళుం టావు!" యెగిరిగంతేసి పెళ్ళికి సిద్ధపడుతుం దనుకున్న సీత జవాబు యింటా మెకి ఆశ్చర్యం కలిగించింది.

"మరేం ఫరవాలేదు. యిప్పుడు ఆడవాళ్ళు పెళ్ళి చేసుకుంటేనేగాని బ్రతక లేరన్న వాదంలో పసలేదు. రోజులు మారిపోయాయి" సాధ్యమై నంత సౌమ్యంగా నవ్వుతూ అంది సీత. మాటల కోసం తడుముకుంటూ నిస్సహాయంగా సీత వైపు చూసింది యింటామె.

"శీతా, పెద్దదాన్ని నీ మంచికే చెపుతున్నాను విను. యెవరో యేదో అంటారు! అయినింటి పిల్లవి, మంచి మర్యాదగల కుటుంబములోంచి వచ్చావు, అలా పెళ్లి వద్దన కూడదు. చక్కగా నేను చెప్పినట్లు శంకరాన్ని

"క్షమించండి పిన్నిగారూ! పెద్దవారు మీ మాట కాదన్నందుకు యేం అనుకోకండి. నేను పెళ్ళిచేసుకో కూడదని నిశ్చయించుకున్నాను. నా నిశ్చయం మారదు!" స్థిరంగా అంది.

"బాగానేవుంది సంబరం! పిలిచి పిల్లనిస్తామంటే కులం తక్కువన్నాట్ట! అలావుంది నీ వరస. ఏదో వాడు నీవంటె అభిమాన పడ్తున్నాడని అడిగాను కాని, వాడికేం నీ పాటి అందెగత్తెలు దొరకరనా! కో అంటే కోటిమంది వచ్చి వాడి కాళ్ళమీద పడతారు!" మూతి మూడు వంకర్లు త్రిప్పుకుని సణుక్కుంటూ వెళ్ళి పోతున్న ఆవిడని చూస్తుంటే సీతకి ద్రాక్ష పళ్ళ సామెత గుర్తు కొచ్చింది. ఎలాగో వదిలింది గొడవ! .... ఆవిడకి కోపంవస్తే వచ్చింది! తనేం చేయగలదు! మహా అయితే యింట్లోంచి పొమ్మంటుంది. అంతేగా! ... హు.... పెళ్ళి లేకపోయినా ఫరవాలేదుగాని చేసుకుని .... చేసుకుని శంకరాన్నా చేసుకోడం! ....

ఆ రోజునించి సీతకి కష్టకాలం ప్రారంభ మయింది. అంత వరకు సీత అభిమానం కోసం ప్రాకులాడిన శంకరం సీత తిరస్కరించిన దగ్గర నించి కక్షసాధించడం మొదలు పెట్టాడు. యిదివరకు సీత నీళ్ళు పట్టుకోడానికి రాగానే లేచి నీళ్ళు పట్టుకోమనే శంకరం యిప్పుడు అటు చూడనట్లు వెకిలి పాటలు పాడుతూ గంటల కొద్ది కొళాయి వదలడు. యీలలు వెయ్యడం, కన్నుగీటడం, సందర్భాను సారంగా సినిమా డైలాగులు పల్లించడం మొదలు పెట్టాడు- యింట్లో స్నానం చెయ్యడం, వంటకి నీళ్ళు పట్టుకోడం అంటే అసాధ్యమైన పని అయిపోయింది. సీతకి ఓ పది పది హేను రోజులు పోయాక, సహనం నశించి, ఓరోజు యింటామెతో చెప్పక తప్పలేదు.

"బాపుందామ్మా: యింక నీవు యింట్లో వున్నావని వాడు స్నానం

6)

చెయ్యడా ! కొనీసం వాడు గదిలో తలుపులు బిగించి కూర్చోవాలా ! ఆడపిల్లలే బరితెగించి రోడ్లమీద పడుతుంటే మగవాడికేం ఖర్మ యింట్లో మూల కూర్చోడానికి ! అంటు నిరసనగా మాట్లాడింది. అంతవరకు సీత పట్ల యెంతో అభిమానం కనపరచిన ఆమె యీ మధ్య సీత పట్ల ముభావంగా వుండసాగింది. సీతని చూడగానే మొహం చిట్లించుకొని యెలక మీద పిల్లి మీద పెట్టి దెప్పడం సాగించింది.

ఒంటరిగా, పెళ్ళిచేసుకోకుండా ఆడపిల్ల ఉండడంలో మజా ఏమిటో సీతకి తెలియ చెప్పాలని పగపట్టాడు శంకరం. యింటి కెదురుగ్గా కిళ్ళీబడ్డీ మీద బైఠాయించి సీతవంక చూపించి యేదో చెప్పడం, ఆ తర్వాత వెక్కిరింతలు వెకిలిపాటలు, యీలలు, రకరకాలపేర్లు పెట్టి పిలవడం ఆరంభించాడు. సీత స్కూలుకి వెళ్ళేటప్పుడు యెదురుగా కూర్చుని యేవేవో వెకిలి పనులు చేయడం, యెలగో లాగ యేడిపించాలని చూడ్డం అతని ఉద్యోగ మయింది.

యేం చేయాలో తోచని నిస్సహాయ స్థితిలో పడింది సీత. ఆ మాటలు చేతలు చూస్తుంటే యీడ్చి చెంప వాయగొట్టా లన్నంత కోపం ముంచు కొచ్చేది. కాని తన ఏహ్యత, ద్వేషాన్ని లోలోపలే దాచుకుని వీలయినంత వరకు శంకరం కంట బడకుండా వుండడానికే ప్రయత్నించేది.

రాను రాను శంకరం చేష్టలు భరించడం దుస్సహమై పోయింది. శంకరం ఆ కిళ్ళీకొట్టు వాడేగాక, యింకాయెవరో నలుగు రయిదుగురు రౌడీలు ఆ కిళ్ళీకొట్టు ముందు చేరారు. జుగుప్స కలిగించేవేషాల్లో. కిళ్ళీ బిగించి, సిగరెట్ పొగ విలాసంగా వదుల్తూ, చవకబారు పాటలతో, పోకిరీ చూపులతో సీత గదిముందు కిళ్ళీకొట్టుదగ్గిర తిష్టవేసి సీత యెప్పుడు బైటికి వస్తుందా ఎప్పుడు ఏడిపిద్దామా అని రాబందుల్లా కాచునే వారు. యెంత వినకూడదనుకున్నా, వాళ్ళని, వాళ్ళ మాటలని పట్టించుకోకూడ దనుకున్నా

సాధ్యపడేది కాదు సీతకి. యెంత వాళ్ళ కంటబడ కూడదనుకున్నా స్కూలుకి వెళ్ళేటప్పుడు, వచ్చేటప్పుడు తప్పేది కాదు సీతకి. యింట్లోంచి బయట పడాలన్నా, యింటికి సమీపిస్తున్నా సీత గుండెలు దడ దడ లాడేవి. చేతులు కాళ్ళు వణికేవి. ఆ కంగారు చూసి పెద్ద ఘన కార్యం సాధించిన వాళ్ళలా విరగబడి నవ్వేవాళ్ళు.

రోజు రోజుకి పరిస్థితి అధ్వాన్న మవుతూంటే యింటిని మార్చడం తప్పించి గత్యంతరం లేకపోయింది సీతకి. కాని యెంత ప్రయత్నించినా ఆ సదుపాయంతో, ఆ మాత్రం అద్దెతో అనుకున్నంత తొందరగా యిల్లు ఏది దొరక లేదు సీతకి.

శంకరానికి, వాళ్ళకి భయపడి గదిలోంచి కదలడమే మానుకుంది. గాలి వెల్తురు వచ్చే కిటికి మూసుకు కూర్చునేది. మరీ గాలిలేక ఉక్కపోసి ఏక్షణాన్నయినా భయపడ్తూ కిటికి తెరవగానే సినిమా ప్రేమ గీతాలు విని పించేవి.

ఎవరితో చెప్పుకోడం ? ఏమని చెప్పుకోడం ? యేమిటి చెయ్యడం ? యెలా వీళ్ళ బారినించి తప్పించుకోడం ? రాత్రింబగళ్ళు సీతకి అదే ఆలోచన, అదే సమస్య అయికూర్చుంది.

యింకో యింటికి వెడితేమాత్రం, యీ శంకరాలు అక్కడమాత్రం ఎదురవరని ఏమిటి నమ్మకం ? లోపం, తను ఆడపిల్ల ... ఒంటరిగా వుండడంలోవుంది. పోనీ, తండ్రిని సాయం తెచ్చుకుందామన్నా, తండ్రి మంచాన వున్నాడు. కదలలేడు. తను బయటికి వెడితే చూసేవారు లేరు. అయినా తన వెర్రికాని.... యెవరు యెన్నాళ్ళు సాయ ముండగలరు ? యింకా ముందు ముందు యెంతో బ్రతుకుంది. తనకి యెప్పుడూ ఎవరు తోడుంటారు ! ఆ సమస్య పెళ్లాడితేగాని తీరదు ! ఎవరో ఒకర్ని పెళ్లాడుదా

మన్నా క్షణాలమీద జరిగేదా! తను అనుకొన్నా తనని చేసుకోడానికి సిద్ధంగా ఎవ రున్నారు! పోనీ ఉద్యోగం వదిలిపెట్టి అన్నగారి యింట్లో భారమైపోతుందా? అప్పుడుమాత్రం జీవితం యింకో మాదిరి నరకం కాదా?

యెన్ని విధాల ఆలోచించినా పరిస్థితులను ధైర్యంగా యెదుర్కోడం మినహా యింకోదారి తోచలేదు సీతకి.

అవును, యిలాంటి వెధవలకి తను భయపడడం ఏమిటి? యేం చెయ్యగలరు వీళ్ళు తనని? నోటితీట తీరేదాకా కూస్తారు. వాళ్ళ కూతలు తనెందుకు పట్టించుకోవాలి. యిలాంటి అల్పులకి జడిసి మనసు పాడుచేసుకోడం ఏమిటి తను?

ఆ రోజునుంచి సీత నిర్లక్ష్యంగా ప్రవర్తించడం ఆరంభించింది. వాళ్ళు నవ్వుతున్నా, వెక్కిరిస్తున్నా గాభరాపడకుండా, తొణక్కుండా సూటిగా ధైర్యంగా వాళ్ళ మొహాలవంకే చూస్తూ వెళ్ళిపోయేది. వాళ్ళు ఏ పేర్లు పెట్టి పిలుస్తున్నా కోపం తెచ్చుకోకుండా నిర్లక్ష్యంగా నవ్వుకుంటూ వెళ్ళిపోయేది.

సీత ప్రవర్తన వాళ్ళకి మొదట్లో ఆశ్చర్యం కలిగించింది. ఆమె నిర్లక్ష్యానికి రకరకాల అర్థాలు తీశారు. అలవాటు పడిపోయింది. యింక పాతయెత్తులు పనికిరావని ఒక డంటే మెత్తబడి దార్లోకి వస్తూంది. అవకాశం జారవిడవకూడ దని ఒక డన్నాడు.

రెండు రోజులు ఏ అల్లరి లేకుండా గడిచిపోయాయి. సీత వాళ్ళ అల్లరి తగ్గడానికి కారణం తెలియకపోయినా, విసుగెత్తి వూరుకుని ఉంటారని సంతోషించింది.

ఆమె సంతోషంకాస్తా రెండు రోజులు కాకముందే అణగారి

పోయింది. ఆ రోజుసాయంత్రం స్కూలునించి వచ్చి మామూలుగా వంట చేసుకుంటూంటే తలుపు తట్టిన చప్పుడయింది. ఎవరో కుర్రవాడు పొట్లం ఒకటి చేతిలో పెట్టి 'అయన' ఈయమన్నా రని కిళ్ళీ కొట్టువైపు చూపించి తుర్రుమన్నాడు.

పొట్లం విప్పిచూసింది సీత. మల్లెపూలు, మిఠాయి, ఓ కాగితం ముక్క. 'రాత్రి పదిగంటలకి.... తలుపుతెరచి వుంచుతావుగదూ!' ఒకే ఒకవాక్యం! యెదుట కిళ్లీకొట్టుమీద మామూలుగా కనబడే నలుగురు ఐదుగురిలో ఒకడు జేబులో చేయిపెట్టి సిగరెట్ దమ్ము లాగుతూ వెకిలిగా నవ్వుతూ చూశాడు.

సీత ఒక్కక్షణం మూఢురాలైంది. ఆ తర్వాత అణుచుకోలేని ఆగ్రహావేశాలతో చరచర గుమ్మందిగి వాడి దగ్గరకి వెళ్ళి మొహాన్న ఉమ్మేసింది. పొట్లం విసిరి కొట్టింది మొహన్న. "రాస్కెల్, యెవరను కున్నావు పూలు పంపడానికి! పదిగంటలకు తలుపుతీసి వుంచాలా! అలాగే, చెప్పుదెబ్బలు తినాలనివుంటే, రా!" ఏమిటో అనేసింది సీత. ఆవేశంలో అన్న సీత వెంటనే అవతల వాడి మొహం అవమానంతో నల్లబడడం, కళ్ళలో పగ రాజుకోడం వగైరాలు చూసి భయంతో కాళ్ళు తేలిపోతూండగా గదిలోకి ఒక్క వుడుకుతో వచ్చిపడింది.

గదిలోకి రాగానే మంచం మీదపడి వెక్కి వెక్కి ఏడవసాగింది. యెలా బ్రతకడం? ఏమిటిదారి? మనోవ్యధ, అనుమానం, దుఃఖం ఆమెని కాల్చసాగాయి. ఆరునెలల వంటరి జీవితమే యింత దుర్భరమైతే, యింక బ్రతుకంతా యెలా వెళ్ళదీయడం! నిజంగా వాళ్ళు నలుగురు కలసి కట్టుగా తనమీద దాడిచేస్తే తన కెవరు దిక్కు! వంటరిగా తనేం చేయగలదు? వాడి కళ్ళతో పగ స్పష్టంగా కనిపిస్తూంది! నిజంగా ఏ దురంతానికైనా ఒడి గడితే తనని ఎవ రాదుకుంటారు! ఏం చేస్తుంది! ఇక్కడనించి ఉద్యోగం

వదులుకుని వెళ్ళిపోయినా ఇంకో వూర్లోమాత్రం యిలాంటి రాబందులు వుండవని ఏమిటి నమ్మకం? ఆడది వంటరిగా బ్రతకడానికి స్థానంలేదా యీ దేశంలో!

అలా ఓగంట ఏడుస్తూ పడుకుంది సీత. ఆ క్షణాలలోనే ఏదో నిశ్చయానికి వచ్చింది. ఎదురు తిరిగే మనసుని నొక్కిపట్టింది. స్థిరంగా లేచినుంచుంది. ఏడ్పుతో ఎర్రబడ్డకళ్ళు తుడుచుకుంది. మొహం కడుక్కొని. జుత్తు సరిచేసుకుని.... యింటావిడతో మాట్లాడడానికి వెళ్ళింది మళ్ళీ తన నిశ్చయం మారకుండా.

అసంభవ మనుకున్న కూతురుపెళ్ళి జరుగుతూంటే, మంచంలోంచే చూసి, కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు. విశ్వనాథం. అవి ఆనంద బాష్పాలు!

శంకరం మెడలో మూడుముళ్ళు కడుతూంటే, సీత కళ్ళు మూసుకుంది. ఆమె కళ్ళనించి రెండు నీటిబొట్లు ఆమె చేతిమీదకి జారి పడ్డాయి.

విశ్వనాథం కన్నీటికి, సీత కన్నీటికి తేడా వుందా! ఏమో! ఆ తేడా ఏమిటో తెలిస్తే సీతకి, యింకా తెలిస్తే ఆ పిల్లకి జన్మ యిచ్చిన దేముడుకి మాత్రం తెలుస్తుంది!

సీత ఆ క్షణాన్న భగవంతుడిని ధనం అడగలేదు! భర్త అనురాగం ఆదరణ కావాలని అడగలేదు. తన గృహం స్వర్గసీమగా చేయమని ప్రార్థించలేదు. కళ్లు మూసుకుని ఒకేఒక విన్నపం దేముడికి వినిపించింది. భగవంతుడా, యే జన్మకైనా, యెన్ని జన్మలకైనా నాకు ఆడజన్మ మాత్రం యీయకు! అంతకన్నా ఏతుచ్ఛమైన పురుగయినాసరే' అని మాత్రం కోరుకుంది.

(ఆంధ్ర విశ్వసాహితి పోటీలో
ద్వితీయబహుమతి పొందినది)